# బాల్యం

"ఒరే రాముడూ? కాస్త కోమటికొట్టుమీదికి వెళ్లి మిరియాలు తీసుకురావూ నాయనా?"

"డబ్బులియ్యి."

తల్లిదగ్గర డబ్బులు తీసుకుని రాముడు ఒక్క పరుగులో వెళ్ళి పోయాడు. సరళని వదలి వెళ్ళడం అతనికి మనస్సు ఒప్పకపోయినప్పటికీ 'తను చెయ్యకపోతే ఇంకెవరుచేస్తారీపని?' అనుకుని సంతృప్తిపడ్డాడు.

సరళ రాముడికి అయిదేళ్ళ చెల్లెలు. చాలా పెంకిపిల్ల. రాముణ్ణి అస్తమానూ కరుస్తూ రక్కుతూ ఉండేది. కాని రాముడెప్పుడూ ఆమెను మళ్ళీ కొట్టి ఎరగడు. ఆమె తనకంటే చిన్నపిల్ల అనో, మరెందుచేతో రాముడికి సరళ అంటే అపరిమితమయినజాలి. ప్రేమ. అతడు ఆమెను వదలి ఎప్పుడూ, ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు. అతను బడికివెడితే సరళకూడా ఉండేది. ఆడుకోడానికి వెడితే కూడా వచ్చేది.

సరళ మంచం ఎక్కిన ఈ పదిరోజులూ అతనికి ఆటలు అదో మోస్తరుగా ఉన్నాయి. మొదటి మూడు రోజులూ ఎల్లాగో బడికి వెళ్ళాడుగాని నాలుగోనాడు అతనికి బడి అంటే విసుగెత్తింది. అతను అమ్మదగ్గరకు వెళ్ళి 'ఈవేళ స్కూలు మానెయ్యొద్దుటే?' అని అతిదీనంగా అడిగాడు. 'సరేలే' అంది తల్లి. అతని దైన్యాన్ని చూసి జాలిపడిగాదు. సరళకి ఒంట్లో అల్లాఉన్న మూలాన్న అతడు అడిగిన ప్రశ్నకి ఏదో పరధ్యానంగా ఆమె జవాబు చెప్పింది.

రాముడు మిరియాలు తీసుకువచ్చాడు. తల్లి రసంతీసి మందుతో బలవంతంగా సరళకి తాగిస్తోంది. సరళ కిందపడి దొర్లుతూ మారాము చేస్తోంది. తల్లి బలవంతంగా కాళ్లమీద పడుకోబెట్టుకుని బుజ్జగిస్తోంది.

"మా తల్లిగాదు. ఇది తాగితే రేపు జ్వరం తగ్గిపోతుంది. తాగుమరి రేపు ఇంక ఒద్దులే."

"ఎదవ రామిగాడు పాపం. మిరియాలు తీసుకొచ్చాడు పాపం. వాణ్ణి తాగమనలేవు. ఆ! ముందు వాణ్ణి తాగమను," సరళ గొంతెత్తి ఏడుస్తూ కాళ్ళమీదనించి దొర్లిపోతోంది.

తనకి జ్వరంవస్తే రాముడు తాగేవాడో లేదోకాని సరళకోసం కొంతరసం గుటుక్కుని తాగేశాడు. సరళ కొంచెం ఏడుపుమానింది. తల్లి ఉగ్గు పట్టినట్టుగా నోట్లో వేలుపెట్టి రసం పోసింది. అది గొంతుకలోకి దిగడంతోటే ఉక్కిరిబిక్కిరయి, తుపుక్కుమని ఎదురుగా కూర్చున్న రాముడిముఖంమీద పడేటట్లుగా సరళ ఉమ్ము వేసింది. తల్లి సరళని రెండు వీపుమీద గట్టిగా తగలనిచ్చి లేచి లోపలికి వెళ్ళిపోయింది. సరళ ఏడుపు ఎక్కువయింది. రాముడు ఊరుకోబెట్టడానికి ప్రయత్నించాడు. సరళ అతన్ని పట్టుకొని రక్కి కరచి అరవడం ప్రారంభించింది. రాముడు మాత్రం అల్లాగే సముదాయిస్తున్నాడు.

"కుంపటిల్లా పట్టుకురారా"

రాముడు కుంపటి చెవుల్ని రెండు చేతులతోనూ పట్టుకోడంతోటే రెండు చేతులూ చుర్రున కాలాయి, గబుక్కుని కుంపటి కిందకి వదలివేశాడు.

"గుడ్డతో పట్టుకోబాబూ! చెయ్యి కాలుతుంది."

గుడ్డతో పట్టుకుని రాముడు కుంపటి తీసుకొచ్చాడు. దానిమీద నీళ్ళు పెట్టి తల్లి సరళ కడుపు కాస్తోంది. రాముడు కుంపటి విసురుతున్నాడు.

సరళ రెండురోజులనించీ కళ్ళు విప్పడంలేదు. జ్వరం ఎక్కువగా ఉంది, అప్పుడప్పుడు కడుపులో పోట్లు వచ్చి గావును గిలగిల కొట్టుకుంటుంది. వైద్యుడు సుబ్బారాయుడు కడుపుకి కాపడం పెట్టమన్నాడు. రాముడి కీ జ్వరం చాలా విసుగ్గా ఉంది. ఎన్నాళ్లుంటుందో వెధవ జ్వరం?

ఇప్పుడు సరళ ఏమీ మారాము చెయ్యడం లేదు. రాముడు దగ్గరగా కూర్చుని ఒళ్ళు నిమిరినా అట్టే కదలదు. చిరాకు పడదు మునపటిమల్లే రక్కదు. గిల్లదు. కేకలు వెయ్యదు.

"ఛా! ఇదంతా ఏమీబాగాలే" దనుకున్నాడు రాముడు.

"బాబూ! సుబ్బారాయుడు దగ్గరకు వెళ్ళిమందు పట్రా, అల్లాగే ఉందని చెప్పు. రాత్రినించీ మళ్ళీ కడుపునెప్పి రాలేదని చెప్పు."

రాముడు సుబ్బారాయుడు దగ్గరకు వెళ్లాడు. సుబ్బారాయుడు మందిచ్చాడు. రాముడు అనుమానంగా అడిగాడు.

"ఎప్పుడు తగ్గిపోతుందండీ జ్వరం?"

"తగ్గిపోతుంది. రెండుమూడు రోజుల్లో."

రాముడి మస్సు కొంత తేలికపడింది. ఇంక రెండుమూడు రోజుల్లో సరళని మళ్లీ బడికి తీసుకుపోవచ్చు; పక్క ఇంట్లోకి ఎవరో కొత్త పిల్ల లొచ్చారు. తనకి తీరుబడిలేక వాళ్ళనింకా సరిగా పలకరించలేదు. అందులో ఒక కుర్రవాడి దగ్గర కొత్త కొత్త మోటారులూ, బొమ్మలూ, మంచి రంగు అట్టల పుస్తకాలూ ఎన్నో ఉన్నాయి. సరళకి అవన్నీ చూపించాలి. అతనికిప్పుడన్నీ జ్ఞాపకం లేవన్నమాటగాని, ఇంకా చాలా సంగతులున్నాయి.

రాముడు గంతులు వేసుకుంటూ ఇంటికి తిరిగివచ్చాడు.

మూడునాళ్ళూ గడిచిపోయాయి. సరళకి ఇంకా అల్లాగే ఉంది. సుబ్బారాయుడు చెప్పింది అబద్ధమయిపోయింది. ఒకవేళ ఊరికే తనతో అల్లా అన్నాడేమో సుబ్బారాయుడు.

ఇంకో అయిదురోజులు అల్లాగే గడిచిపోయాయి. పక్కయింటికి వచ్చిన కొత్త కుర్రవాళ్ళంతా వెళ్లిపోయారు వాళ్ల బొమ్మలూ, మోటార్లూ అన్నీ పట్టుకుని. సరళ బొత్తిగా కళ్ళు విప్పడంలేదు. కళ్లు రెండూ బాగా పొంగరించి ఉన్నాయి. ఊపిరిపీల్చుకునేటప్పుడు కొంచెం గురగురమంటుంది. అప్పుడప్పుడు ఒక మూలుగు మూలిగి ఒక పక్కనించి ఇంకో పక్కకి వత్తిగిల్లుతుంది.

మునుపు ఎప్పుడయినా ఇలా ఉండేదా సరళ? పాపం, ఏమనుకుంటుందో! ఆటలాడుకోడానికి వీల్లేదు. బడికి తనతో రావడానికి వీల్లేదు. కేకలు వెయ్యడానికి ఓపికలేదు. జ్వరం వస్తే ఎల్లా తోస్తుంది? రాముడు సరళ పక్కమీద కూర్చున్నాడు.

"ఎదవరామిగాడు, వాణ్ణి కొట్టవే అమ్మా."

సరళ తనలో తను గొణుక్కుంటుంది నెమ్మదిగా. పదిరోజులీ మధ్యని సరళ మాట్లాడలేదు.

"వొద్దు... నాకొద్దు... డబ్బియ్యి... ఇత్తావా ఇయ్యవా?" సరళ వంటిమీద చెయ్యివేసి రాముడన్నాడు;

"ఇస్తుందిలే అమ్మా! జ్వరం తగ్గిపోయాకాను..."

సరళ రెండో పక్కకి దొర్లి ఏవో అర్థం తెలియని మాటలు మాట్లాడింది. రాముడికి భయం వేసింది. తల్లిని పిలిచాడు.

"అమ్మా! ఎందుకే ఇల్లా మాట్టాడుతుంది?"

"పలవరింతలు గావునురా. వెళ్లి సుబ్బారాయుణ్ణి తీసుకురా" తల్లి మంచం పక్కని కూర్చుంది. సరళ వంటిమీద చెయ్యివేసింది. ఆమె ముఖంలో భయం రాముడు చూశాడు.

రాముడికి ఆ పరిస్థితులన్నీ చాలా గంభీరంగా కనిపించాయి. తనకి తెలియని సంగతులేవో జరిగిపోతున్నట్టు అనిపించింది అతనికి. ఇంట్లో అతనికంటే పెద్దమగాళ్ళు ఎవరూ లేరు! పెద్దవాళ్ళు చేసే పనులన్నీ తనే చెయ్యాలిప్పుడు. అంతా ఇప్పుడు తనమీద ఆధారపడి ఉంది. ఒక్కసారిగా పెద్దవాడినై పోయాననుకున్నాడు. రాముడు, ఒక్క పరుగులో వెళ్ళి సుబ్బారాయుణ్ణి పిలుచుకువచ్చాడు.

సుబ్బారాయుడు మంచం పక్కని కూర్చుని సరళ చెయ్యి అతి జాగ్రత్తగా చూశాడు. రాముడు బొమలు ముడివేసి నడ్డిమీద – పెద్దవాళ్లలాగ – రెండు చేతులూ ఆన్చి నిలబడి అతి తీక్ష్ణంగా చూస్తున్నాడు. సుబ్బారాయుడు ఒక కాగితంమీద ఏదో రాసి రాముడిచేతికిచ్చాడు అన్నాడు:

"అబ్బాయి ఇది మా ఇంట్లో చూపిస్తే ఒక మందు ఇస్తారు. ఒక్క పరుగులో వెళ్ళి తీసుకురావాలి. ఇక్కడున్నట్టు రావాలి సుమా."

'పరుగెత్తడం మీరు నాకు నేర్పక్కరలేదు' – అన్నట్టుగా సుబ్బారాయుడువేపు చూసి చీటీ పుచ్చుకుని పరుగెత్తి వెళ్లిపోయాడు రాముడు. తనెల్లా పరుగెత్తగలడో ఆయనకేమన్నా తెలుసా? పెద్ద తనతో చెప్పాలా ఏమిటి ఒక్క పరుగులో రావాలి. సరళ తన చెల్లెలా? ఆయన చెల్లెలా?

రాముడు ఆయాసంగా పరుగెత్తుకుంటో తిరిగి వచ్చీసరికి ఏదో కొంత మారింది, సరళని మంచం మీదనించి కిందకి దింపారు. సుబ్బారాయుడు సరళ కాళ్ళకేదో మర్దనా చేస్తున్నాడు. తల్లి చీరచెంగు ముఖంమీద కప్పుకొని ఏడుస్తోంది.

అతను వచ్చీలోగా ఏదో జరిగిపోయింది. తనని చూడనియ్యకుండా సుబ్బారాయుడు ఎక్కడికో పంపించాడు. ఏం జరిగిందో తను చూడలేదు. సరిగా తనని అప్పుడే పంపించాలా?

సుబ్బారాయుడు మందు సరళనోట్లో వెయ్యడానికి ప్రయత్నించాడు. సరళ నోరు తెరవలేదు. బలవంతంగా నోరు తెరచి మందువేశాడు? అల్లా బలవంతంగా

నోరుతెరుస్తాడేం? నెప్పెట్టదూ? అప్పుడప్పుడు అన్నం దగ్గర కూడా పెంకితనంచేసి నోరుతెరవదు. అల్లాంటిది మందు తినమంటే నోరు తెరుస్తుందా? రాముడికి సుబ్బారాయుడుమీద ఎంతో కోపం వచ్చింది.

"మందు గుటకదిగింది. పనిచెయ్యాలి మరి. ఇంకో గంటకి చూడాలి ఎల్లాఉంటుందో" అన్నాడు సుబ్బారాయుడు.

తల్లి గొల్లుమని ఏడవడం మొదలుపెట్టింది. ఇరుగూ పొరుగూ ఆడవాళ్లంతా వచ్చారు. సుబ్బారాయుడు తనకేదో పనుందని వెళ్ళిపోయాడు. వచ్చిన ఆడవాళ్ళు సరళకి తలో వైద్యం చెయ్యడం ప్రారంభించారు. సరళ ఊపిరి అదో మోస్తరుగా పీల్చుకుంటోంది.

రాముడు తదేకదీక్షతో చూస్తున్నాడు. ఏదో మహావిచిత్రమయిన విషయాన్ని చూసినవాడు తనొక్కడే అందరికంటే ముందుగా దాన్ని చూశాననుకుంటాడు. తన తోడివాళ్లకి ఈ విషయం ఏమీ తెలియదనుకుంటాడు. అంచేత అందరికంటే గొప్పవాడిననుకుంటాడు. రాముడల్లాగే అనుకుంటున్నాడు ఆ దృశ్యాన్ని చూస్తో.

కొంతసేపయిన తరువాత అంతా సరళని వదిలివేసి చుట్టూ కొంచెం దూరంలో కూర్చుని, చీరచెంగులతో కళ్లద్దుకుంటూ, ముక్కులు చీదుకుంటూ అనుకుంటున్నారు.

"ఏం శాశ్వతం, ఆపయిని కలికాలమొచ్చిందర్రా? కలికాలం మూడేళ్లవాళ్లకి నూరేళ్ళు నిండిపోతున్నాయి."

తల్లి సరళమీద పడి ఏడుస్తోంది ఒకావిడ రాముణ్ణి ఒళ్ళోకి తీసుకుని అంది ఏడుపురాగంతో:

"ఏడవకమ్మా! ఏడవకు, చెల్లాయి మన్ని ఒదిలిపెట్టి వెళ్ళిపోయిందమ్మా."

తను ఏడవడంలేందే! చెల్లాయి ఎక్కడకి వెళ్ళిపోయింది? అదే తెలియడంలేదు. ఒక్కసారి సరిగ్గా చూద్దామనుకున్నాడు గాని ఆవిడ అటువేపు చూడనివ్వలేదతన్ని. అసలతనికి ఏడవాలనిలేదు. కాని అంతా ఏడుస్తుంటే అతనికీ ఏడుపొచ్చింది.

ఎవరో ఒకాయన సరళని భుజంమీద వేసుకుని లేవదీశాడు. తల్లిగోల ఎక్కువయింది.

"నా తల్లిని తీసుకుపోతున్నారోయ్! నా తల్లిని తీసుకుపోకండోయ్!"

ఇరుగు పొరుగు అమ్మనంతా ఓదార్చుతున్నారు.

"ఏడవకండి ఏడిస్తే ఏమిలాభం? సచ్చిపోయినవాళ్ళు తిరిగి వస్తారా అమ్మా? కుర్రాడు బెంబేలు పడిపోతాడు."

తల్లి ఏడుస్తుంటే రాముడుకూడా పైకి ఏడవడం మొదలుపెట్టాడు.

"మంచివాళ్లని భగవంతుడు తీసుకుపోతున్నాడమ్మా? భూమ్మీద ఉంచడు ఏం అల్లరి చేసేదండీ పిల్ల ఇల్లంతా ఎంత నిండుగా ఉండేది!"

"మా చిన్నమ్మాయో, ఏంగంతులు ఏం ఆటలు!" అంటూ తన చచ్చిపోయిన కూతుర్ని తలుచుకుని ఏడిచింది ఒకావిడ.

రాముడుకిదంతా చూసేసరికి గాభరాగా అయిపోయింది మనస్సు. ఎవరు

మాట్లాడినా అతనికేమి తెలియడంలేదు. తెలియకపోయినా వాళ్ల మాటల్లో ఏదో అర్థం ఉందనుకున్నాడతను.

కొంతసేపటికి ఎవరిళ్లకి వాళ్ళు వెళ్లిపోయారు. రాత్రి రాముడు ఒంటరిగా మంచంమీద పడుకున్నాడు. తల్లి కొంగు పరుచుకుని పక్కగదిలో ఒకమూల పడుకుంది.

రాముడికి నిద్రరాలేదు. బోర్లగిల పడుకుని ముఖం తలగడాలో దాచి ఏదో ఆలోచిస్తూన్నాడతను. మధ్యాహ్నం ఆ గొడవంతా చూసిన తరవాత అతనికి కళ్లువిప్పి ఆ చీకట్లోకి చూడ్డానికి భయం వేసింది.

అసలు ఏం జరిగింది?

సరళని ఎక్కడికో తీసుకుపోయారు ఎక్కడికి? మళ్ళీ ఎప్పుడొస్తుంది?... మళ్లీ రాదేమో?

చచ్చిపోయినవాళ్ళు తిరిగి రారుట, సరళ చచ్చిపోయింది? అతని గుండెలు దడదడకొట్టుకున్నాయి. అతని లోపలంతా కాళీ అయిపోయినట్టు అనిపించింది.

వాళ్లిందాకా అనుకున్నమాటల కన్నిటికీ కొద్దిగా అర్థం అతనికి తెలిసినట్టు అనిపించింది.

చచ్చిపోయినవాళ్ళు మళ్లీరారు. సరళ చచ్చిపోయింది.

ఒక్కసారి వెల్లగిల్లి తిరిగి ఇల్లంతా కలయజూశాడు. నిజమే! ఇల్లంతా కాళీ! సరళ ఎక్కడాలేదు!

గుండెలు చేత్తో పట్టుకుని ఎవరో పిసికినట్టయినది. తలగడలో మొఖం పెట్టి ఏడవడం మొదలుపెట్టాడు. అల్లా ఏడిచి ఏడిచి నిద్రపోయాడు.

**(భారతి - మార్చి 1938)**